వచ్చే ఏడాదికి సమీకృత పాఠశాలలు పూర్తి

పనులను పరిశీలిస్తున్న ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, కలెక్టర్

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 20 : వచ్చే విద్యాసంవత్సరం నాటికి యంగ్ ఇండియా సమీకృత పాఠశాలల భవన సముదాయ నిర్మాణాలు పూర్తవుతాయని ఎంపీ మల్లురవి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మండలపరిధిలోని తూడుకుర్తిలో నిర్మించనున్న పాఠశాల పనులను ఆదివారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమీకృత పాఠశాలను 25 ఎకరాల స్థలంలో రూ. 125 కోట్లతో 4వేల మంది విద్యార్థులు చదువుకునేలా నిర్మాణం చేపడుతుందన్నారు. వచ్చే విద్యా ఏడాది నాటికి భవన నిర్మాణ పనులు పూర్తిచేస్తామన్నారు.

అభివృద్ధి పర్చేలా పని చేస్తా

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం దేశంలోనే అభివృద్ధి చెందేలా తన వంతుగా పని చేస్తానని ఎంపీ మల్లురవి అన్నారు. కలెక్టరేట్‌లో ఆదివారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై ఈనెల 22న నిర్వహించనున్న అవగాహన సదస్సులో భాగంగా ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి, కలెక్టర్ సంతోష్, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల, వనపర్తి అదనపు కలెక్టర్లు, జిల్లాల అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 22న తేజ కన్వెన్షన్ హాల్‌లో సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్, ఎంఎస్ఎంఈ, తదితర బ్యాంకులకు సంబంధించిన అధికారులు పాల్గొంటారన్నారు. అవసరమైన వారికి బ్యాంకు రుణాలు, బ్యాంకుల గ్యారెంటీ అందిస్తామన్నారు. పార్లమెంటరీ పరిధిలో కెనరా బ్యాంకు సేవలను విస్తృత పర్చాలని కోరారు. సీఎస్ఆర్ నిధులతో విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆయా జిల్లాల అదనపు కలెక్టర్లు సీతారామారావు, దేవసహాయం, నర్సింగ్‌రావు, నేషనల్‌స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ అధికారి శ్రీనివాస్, సివిల్ సొసైటీ ఆర్గనైజేషన్ అధికారి వెంకట్, డీఆర్‌డీవో చిన్న ఓబులేసు, డీఈవో గోవిందరాజులు, బీసీ సంక్షేమ అధికారి నజీమ్‌అలీ, ఎస్సీ అధికారి రామ్‌లాల్, ఎల్‌డీఎం శ్రీనివాసులు, కెనరాబ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, డీసీసీబీ చైర్మన్ విష్ణుమూర్తి ఉన్నారు.

చంద్రోదయం పుస్తకావిష్కరణ

చంద్రోదయం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం

కల్వకుర్తి, అక్టోబర్ 20 : కల్వకుర్తి పట్టణంలోని యూటీఎఫ్ భవన్‌లో ఆదివారం పద్యకవి అల్వాల లక్ష్మణమూర్తి రచించిన చంద్రోదయం పుస్తకాన్ని కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం ఆవిష్కరించారు. సమాజ శ్రేయస్సుకు సాహిత్యం ఎంతగానో ఉపకరిస్తుందని పుస్తకావిష్కరణ సభలో ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అర్షభారతి సమితి అధ్యక్షుడు రామశర్మ, కవులు ఎన్నం రుక్మాంగధ రెడ్డి, యాదగిరాచారి, ఏపీ మల్లయ్య, సుధాకర్, అంజనయ్య, రఘురాములుగౌడ్, జైపాల్, భీమలింగం గౌడ్, శ్రీనయ్యగౌడ్, వెంకటేశ్వర్లు,నారాయణగౌడ్ సాహితీ అభిమానులు, విశ్రాంత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో ఆరు గేట్ల ఎత్తివేత

- జూరాలలో 23 గేట్ల నుంచి నీటి విడుదల
- నిండుకుండలా సుంకేసుల

సుంకేసుల డ్యాం నుంచి 22గేట్లుతో విడుదలవుతున్న నీరు

శ్రీశైలం జలాశయం ఆరు గేట్ల ద్వారా దిగువకు పరుగులు పెడుతున్న వరద

నాగర్‌కర్నూల్ (నమస్తే తెలంగాణ)/అయిజ/రాజోళి, అక్టోబర్ 20 : శ్రీశైలం రిజర్వాయర్ గేట్లు మళ్లీ తెరుచుకున్నాయి. ఎగువన జూరాల నుంచి వరద భారీగా రావడంతో ఇం జినీరింగ్ అధికారులు 6 గేట్లను ఎత్తి నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. జూరాల ప్రా జెక్టుకు వరద పరవళ్లు తొక్కుతుండడంతో 23 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నా రు. ఇన్‌ఫ్లో 1,20,000, అవుట్‌ఫ్లో 1,30,06 5 క్యూసెక్కులుగా నమోదైంది. ఎడమ కాల్వ కు 920, కుడి కాల్వకు 731, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 50 క్యూసెక్కులు వదిలారు. 33,81 4 క్యూసెక్కులను వినియోగిస్తూ ఐదు యూనిట్లలో విద్యుదుత్పత్తి చేస్తున్నారు. పూర్తిస్థాయి నీటి నిల్వ 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 8.949 టీఎంసీల నిల్వ ఉన్నది. ఆల్మట్టికి ఇన్‌ఫ్లో 58,595, అవుట్ ఫ్లో 60,620 క్యూసెక్కులు నమోదుకాగా, ప్రస్తుతం 127.83 టీఎంసీల నిల్వ ఉన్నది. నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 84,646, అవుట్ ఫ్లో 88,811 క్యూసెక్కులు నమోదుకాగా, ప్రస్తుతం 36.98 టీఎంసీల నిల్వ ఉన్నది. టీబీ డ్యాంకు ఇన్‌ఫ్లో 51,407, అవుట్‌ఫ్లో 51,407 క్యూసెక్కులు నమోదుకాగా, నాలుగు గేట్లు ఎత్తారు. డ్యాంలో ప్రస్తుతం 101.421 టీఎంసీల నిల్వ ఉన్నది. ఆర్డీఎస్‌కు ఇన్‌ఫ్లో 66,252, అవుట్‌ఫ్లో 65,600 క్యూసెక్కులు ఉండగా, ఆయకట్టుకు 652 క్యూసెక్కులు వదిలారు. సుంకేసుల డ్యాం నిండుకుండలా మారింది. ఇన్‌ఫ్లో 95,570, అవుట్ ఫ్లో 93,324 క్యూసెక్కులుగా నమోదైంది. 22 గేట్లు ఎత్తి శ్రీశైలానికి నీటిని వదిలినట్లు ఏఈ మహేందర్‌రెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా, శ్రీశైలం జలాశయానికి జూరాల, సుంకేసుల, హంద్రీ జలాశయాల నుంచి 1,95,929 క్యూసెక్కుల నీళ్లు వచ్చి చేరుతున్నాయి. ప్రాజెక్టు గరిష్ఠ నీటి సామర్థ్యం 885 అడుగులకు ప్రస్తుతం 884 అడుగుల్లో ఉన్నది. దాదాపుగా 2లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండడంతో ప్రాజెక్టు ఆరు గేట్లను పది ఫీట్ల ఎత్తి నాగార్జునసాగర్‌కు 1,67,898 క్యూసెక్కులను వదిలారు. కుడి, ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి కొనసాగిస్తున్నారు.

చారకొండ వెంకటేశ్‌కు సముచిత స్థానం

చారకొండ, అక్టోబర్ 20 : తెలంగాణ ఉద్యమకారుడు చారకొండ వెంకటేశ్‌కు విద్యాకమిషన్‌లో సముచిత స్థానం ప్రభుత్వం కల్పించడం హర్షనీయమని సింగిల్ విండో చైర్మన్ జెల్ల గురువయ్యగౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుపేద కుటుంబంలో పుట్టి ఉన్నత చదువులు అభ్యసించి అంచెలంచెలుగా ఎదిగారని చెప్పారు. ఉస్మానియా యూనివర్శిటీలో చదువుకుంటూ తెలంగాణ రాష్ట్ర సాధనకు అనేక ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి గుర్తించి విద్యాకమిషన్‌లో కమిటీ సభ్యుడుగా నియమించడం సంతోషకమన్నారు. ఈ ప్రాంతంలో విద్యావ్యవస్థ బలోపేతానికి, నూతన ఉన్నత విద్యాలయాలు నెలకొల్పేందుకు అవకాశం ఉంటుందన్నారు. విద్యా కమిషన్‌లో చోటు కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డి, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే వంశీకృష్ణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా గ్యార్వీ

ఊర్కొండ, అక్టోబర్ 20 : మండలంలోని ఊర్కొండపేట గ్రామంలో ఆదివారం మైనార్టీలు గ్యార్వీని ఘనంగా నిర్వహించారు. గ్రామంలో మహబూబ్‌సుభానీ పీర్లమసీదు వద్ద నిర్వాహకులు అన్నదానం చేశారు.

పట్టుదలతోనే ఉన్నత లక్ష్యాలు

- ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి

బాలకిష్టారెడ్డిని సన్మానిస్తున్న మాజీ ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి

తాడూరు, అక్టోబర్ 20 : పట్టుదలతో ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఉండ్యాల బాలకిష్టారెడ్డి అన్నారు. తెలంగాణ విద్యా మండలి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆదివారం స్వగ్రామమైన తాడూరు మండలం పర్వతాయిపల్లికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ కుటుంబ సభ్యుల సహాయ సహకారాలతో ఉన్నతంగా రాణించినట్లు తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈవో భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రఘురాంరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందజేత

చారకొండ, అక్టోబర్ 20 : మండలంలోని గోకారం గ్రామానికి చెందిన లక్ష్మమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆదివారం కుటుంబాన్ని బీఆర్ఎస్ నేతలు వెళ్లి పరామర్శించి ఓదార్చారు. మాజీ ఎంపీటీసీ గోపిడి శ్రీనివాస్‌రెడ్డి రూ.10 వేలు, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు రూ.10వేలు ఆర్థికసాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పరుశరాములు పాల్గొన్నారు.

ఊర్కొండలో..

ఊర్కొండ, అక్టోబర్ 20 : మండలంలోని రాచాలపల్లి మాజీ ఉపసర్పంచ్ తండ్రి మైసయ్య గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఆయన అంత్యక్రియలకు రూ.25 వేలు వారి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

చారకొండలో..

చారకొండ, అక్టోబర్ 20 : మండలంలోని గోకారంలో జక్కుల పెద్దమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. కాంగ్రెస్ యువ నేత ఆశాదీప్‌రెడ్డి రూ. 10వేలు ఆర్థికసాయం ఆదివారం కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంతిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బొడ్డుపల్లి కొండల్‌తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

కల్వకుర్తి, అక్టోబర్ 20 : కల్వకుర్తి పట్టణ సమీపంలోని ఎల్లికల్ చౌరస్తా వద్ద అక్రమంగా ఇసుకను తీసుకువస్తున్న ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై మాధవరెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం ఎల్లికల్ చౌరస్తాలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఇసుక ట్రాక్టర్‌ను నిలిపి వాకబు చేశామని, ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ట్రాక్టర్‌లో ఇసుకను తీసుకువస్తుండటంతో ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీజ్ చేశామని ఎస్సై తెలిపారు. ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుకను తరలించిన క్రమంలో సుద్దకల్ గ్రామానికి చెందిన కృష్ణమూర్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బియ్యం అందజేత

బల్మూర్, అక్టోబర్ 20 : బల్మూరు గ్రామంలో కాశమ్మ దశదిన సందర్భంగా ఆదివారం గ్రామానికి చెందిన బీ. సంధ్య శంతన్‌రెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులకు 50 కేజీ బియ్యాన్ని అందజేశారు. సహాయం చేయడంతో గ్రామస్తులు అభినందించారు.

నేటి రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి

అచ్చంపేట, అక్టోబర్ 20 : పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం అచ్చంపేట పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో నిర్వహించే రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని అచ్చంపేట సీఐ రవీందర్ ఆదివారం ప్రకటనలో కోరారు. అచ్చంపేట, ఉప్పునుంతల, లింగాల, బల్మూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎస్సైలు, సిబ్బంది అచ్చంపేట పోలీస్ స్టేషన్‌లో జరిగే అమరవీరుల సంస్మరణ వేడుకలలో పాల్గొంటారని తెలిపారు. రక్తదాన శిబిరంలో యువకులు, అభిమానులు తరలివచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని కోరారు. పోలీస్ అమరులకు నివాళులర్పించి, లయన్స్ క్లబ్ సహకారంతో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

మాలల ఆత్మగౌరవ సభకు తరలిరావాలి

వెల్దండ, అక్టోబర్ 20 : ఈ నెల 27న జిల్లా కేంద్రంలో జరిగే మాలల ఆత్మగౌరవ సభకు మాలలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని మాల సంఘం మండల నాయకుడు ఆనంద్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో మాల సంఘం ఆధ్వర్యంలో మాలల ఆత్మగౌరవ సభ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రాములు, బాలల్‌చెన్నయ్య, కృపానందం, ప్రసాద్, శ్రీరాములు, చంద్రమౌలి, సాలయ్య, సంజీవ్, రాజు, శ్రీను, బాలస్వామి, అర్జున్ ఉన్నారు.

రాజడి

బిల్లుల భారం తగ్గేదెలా?

క్రెడిట్ కార్డ్ బకాయిల చెల్లింపులకు దారులివీ..



క్రెడిట్ కార్డుల్ని సవ్యంగా వినియోగిస్తే వాటితో ఎన్నో లాభాలుంటాయి. ఆర్థిక పరిస్థితుల నిర్వహణలో వీటి పాత్ర ఎంతో ప్రభావవంతం. కానీ దురదృష్టవశాత్తూ చాలామంది ఈ క్రెడిట్ కార్డుల వాడకంతో మితిమీరిన ఖర్చుల వలయంలో చిక్కుకుంటున్నారు. ఈ క్రమంలోనే బిల్లులను చెల్లించలేని దుస్థితికి చేరుకుంటున్నారు. అయితే భారమైన క్రెడిట్ కార్డ్ బిల్లు చెల్లింపులకు కొన్ని మార్గాలున్నాయి. వాటిలో..

ఈఎంఐల్లోకి మార్చడం

చాలా క్రెడిట్ కార్డు సంస్థలు బకాయిలను ఈఎంఐల్లోకి మార్చుకునే సౌకర్యం వినియోగదారులకు ఇస్తున్నాయి. నిజానికి మెజారిటీ బ్యాంకులు ఈ సదుపాయాన్ని ఉచితంగానే కార్డుదారులకు అందిస్తున్నాయి. దీనివల్ల ఒకేసారి పెద్ద మొత్తంలో నగదును సమకూర్చుకునే భారం తప్పుతుంది. అయితే క్రెడిట్ కార్డు బిల్లులను ఈఎంఐల్లోకి మార్చుకునే ముందు కనిపించని చార్జీలు ఏమైనా ఉన్నాయా?, ప్రాసెసింగ్ ఫీజులుంటాయా? అన్నది జాగ్రత్తగా చూసుకోవడం మంచిది.

బిల్లింగ్ విధానంపై అవగాహన

క్రెడిట్ కార్డు వినియోగదారులు తప్పక తమ క్రెడిట్ కార్డ్ బిల్లింగ్ సైకిల్‌ను తెలుసుకోవాలి. బ్యాంకులు క్రెడిట్-ఫ్రీ పీరియడ్‌ను కల్పిస్తాయి. ఇందులో బకాయిల చెల్లింపునకు 30 రోజుల స్టేట్‌మెంట్ సైకిల్, దానిపై 15 రోజుల గ్రేస్ పీరియడ్ ఉంటాయి. ప్రతి నెలా బిల్లింగ్ సైకిల్ ఏ తేదీన మొదలవుతుందో చూసుకోవాలి. ఆ తేదీ తర్వాత కొంటే మనకు పేమెంట్‌కు ఎక్కువ సమయం ఉంటుంది. ఉదాహరణకు మీ క్రెడిట్ కార్డు బిల్లు డ్యూ డేట్ ఆగస్టు 4న ఉన్నది. ఆ బిల్లు స్టేట్‌మెంట్ జూలై 18న వచ్చింది. అయితే జూలై 19న మీరు మీ క్రెడిట్ కార్డు ద్వారా ఓ వస్తువును కొన్నారు. అప్పుడు అది తర్వాతి బిల్లు స్టేట్‌మెంట్‌లో ఉంటుంది. దాన్నిబట్టి సెప్టెంబర్ 4వరకు మీరు దాని చెల్లింపునకు వ్యవధి ఉంటుందన్నమాట. ఒకవేళ జూలై 17న కొంటే ఆగస్టు 4కల్లా చెల్లించాల్సిందే. రెండ్రోజులు ఆగి కొనడం వల్ల ఇంత లాభం ఉంటుంది. సమయం ఎక్కువగా ఉండటం వల్ల నగదు సర్దుబాటుకు వీలుంటుంది.

పర్సనల్ లోన్

క్రెడిట్ కార్డు బకాయిలపై పడే వడ్డీ రేటు కన్నా.. వ్యక్తిగత రుణాలపై పడే వడ్డీ రేటు తక్కువ. కాబట్టి ఎక్కువగా ఉన్న క్రెడిట్ కార్డు బిల్లులను చెల్లించేందుకు పర్సనల్ లోన్ల సహాయం తీసుకోండి. మీ క్రెడిట్ స్కోర్ బాగుంటే వడ్డీ రేటు ఇంకా తగ్గుతుంది. అలాగే మినిమం కంటే ఎక్కువగా క్రెడిట్ కార్డు బిల్లులను చెల్లిస్తే మంచిది. అధిక వడ్డీ బకాయిలను ముందుగా చెల్లించాలి. తక్కువ మొత్తాలను తీర్చడానికే తొలి ప్రాధాన్యత ఇవ్వాలి. అంతకన్నా ముందు అనవసరపు కొనుగోళ్లను తగ్గిస్తే బిల్లుల భారం తగ్గుతుంది.

రిటైర్మెంట్ ప్లానింగ్ ఇలా..

ద్రవ్యోల్బణం ప్రభావాన్ని మరువద్దు

రిటైర్మెంట్ కోసం పెట్టుబడులు పెడుతున్నప్పుడు ద్రవ్యోల్బణం ప్రభావాన్ని పరిశీలించడం చాలాచాలా ముఖ్యం. భవిష్యత్తులో ఆయా వస్తూత్పత్తులు, సేవల ధరల్లో చోటుచేసుకునే పెరుగుదలనే ఈ ద్రవ్యోల్బణం సూచిస్తుంది. ఒకవేళ దీన్ని పరిగణనలోకి తీసుకోకుండా రిటైర్మెంట్ పెట్టుబడులు పెట్టినట్లైతే ఆ వచ్చే సొమ్ము పెరిగిన ధరలకే పోతుంది తప్ప.. మీ అవసరాలకు మాత్రం చాలదు. దీనివల్ల మీ పదవీ విరమణ అనంతరం జీవితం కూడా ఆశించిన స్థాయిలో ఆనందంగా ఉండదు. అందుకే ఇప్పటి ద్రవ్యోల్బణం స్థాయి, అప్పటి ద్రవ్యోల్బణం లెక్కల్ని అంచనా వేసి, దానికి తగ్గట్టుగానే పెట్టుబడులకు వెళ్తే లాభదాయకం.

పొదుపుపై ధరల దెబ్బ

రిటైర్మెంట్ సేవింగ్స్‌పై ద్రవ్యోల్బణం ప్రభావం నిజంగా చెప్పాలంటే చాలా ఎక్కువే. ఎంతోమంది వృద్ధులు వారి పెన్షన్, రిటైర్మెంట్ ఫండ్స్‌పైనే ఆధారపడి జీవిస్తూంటారు. అయితే పెరిగే ధరలు వారి రిటైర్మెంట్ సేవింగ్స్ వాస్తవ విలువ క్షీణతకు దారితీస్తాయి. దేశంలో ద్రవ్యోల్బణం హెచ్చుతగ్గులు.. సాధారణ వ్యక్తులు, వేతన జీవులనే అధికంగా ప్రభావితం చేస్తుంటాయి. పదవీ విరమణ అనంతరం పెన్షన్ ఆదాయంపై జీవించేవారికి ద్రవ్యోల్బణం కష్టాలు తప్పవు. అందువల్ల కాబట్టి ముందుగానే ద్రవ్యోల్బణం అంచనాలతో పెట్టుబడులకు దిగితే ఆ ఇబ్బందులను వృద్ధాప్యంలో అధిగమించవచ్చు. లేకపోతే చాలీచాలని ఆదాయంతో సమస్యల్ని ఎదుర్కొనే ప్రమాదం ఉంటుంది.

ఇదీ సంగతి..

రిటైర్మెంట్ సేవింగ్స్‌ను ద్రవ్యోల్బణం ఏవిధంగా ప్రభావితం చేస్తుందో చూద్దాం. ఉదాహరణకు.. నేడు మీ ఖర్చులు రూ.5,000 లుగా ఉన్నాయి. అయితే 6 శాతం ద్రవ్యోల్బణం ప్రభావంతో భవిష్యత్తులో ఈ ఖర్చు రూ.5,300లకు పెరిగిందనుకుంటే, వచ్చే 30 ఏండ్లలో.. అది దాదాపు రూ.28,700లను తాకగలదు. దీన్నిబట్టి ఒక్కసారి ఆలోచించండి.. మీరు ఈరోజు బాగానే పొదుపు చేస్తున్నామనుకుంటున్న మొత్తాలు, అప్పటికి ఎంతమేరకు మీ ఖర్చుల్ని భరించగలవోనని.

అధిక నిధి ఎలా?

ద్రవ్యోల్బణం ప్రభావం నుంచి మీ రిటైర్మెంట్ ఫండ్స్ రక్షణకు ఈ విధంగా ప్రయత్నించవచ్చని కొందరు నిపుణులు సలహా ఇస్తున్నారు. వాటి ప్రకారం..

ఈక్విటీల్లో పెట్టుబడులు

ద్రవ్యోల్బణాన్ని మించి ఆకర్షణీయ రాబడులను అందుకోవాలంటే.. స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులను పరిశీలించడం ఉత్తమం. దీర్ఘకాలంలో పెద్ద ఎత్తున ఆదాయం లేదా లాభాలను పొందాలంటే ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్స్ సరిఅని చెప్పవచ్చు. నిజానికి స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. అయితే షార్ట్-టర్మ్ ఇన్వెస్టర్లకే ఈ రిస్క్ ఉంటుందని కూడా గుర్తుంచుకోవాలి. రోజూ చూస్తున్న ఒడిదొడుకులు వీరినే ఎక్కువగా ప్రభావితం చేస్తాయి. లాంగ్-టర్మ్ ఇన్వెస్టర్లకు ఇది తక్కువే. అందుకే స్వల్పకాల లక్ష్యాలతో ఈక్విటీల్లో పెట్టుబడులకు దిగవద్దు. అందుకు భిన్నంగా ముందుకెళ్తే.. ద్రవ్యోల్బణాన్ని మేనేజ్ చేసే ఆకర్షణీయ రిటర్న్స్‌ను సొంతం చేసుకోవచ్చు. ఆర్థిక నిపుణుల సలహాలు తీసుకున్నట్లైతే మరింతగా సత్ఫలితాలుంటాయి.

పెట్టుబడుల వర్గీకరణ

పెట్టుబడుల వర్గీకరణ వాటికున్న రిస్కుల్ని తగ్గించగలదు. అందుకే మీ పోర్ట్‌ఫోలియోలో రకరకాల పెట్టుబడి సాధనాలను చేర్చుకోండి. నిపుణుల సూచనల ప్రకారం.. స్టాక్స్‌లో 30 శాతం, బాండ్లలో 30 శాతం, రియల్ ఎస్టేట్‌లో 30 శాతం, నగదు-బంగారంపై మిగతా 10 శాతం పెట్టుబడులు పెడితే లాభదాయకంగా ఉంటుంది. ఇలా చేస్తే ఆయా రంగాల్లో ఎదురయ్యే సవాళ్లను అధిగమించవచ్చు. ఒక ట్రెండు రంగాల్లో నష్టాలు వాటిల్లినా.. మిగతా రంగాల్లోని లాభాలతో వాటిని భర్తీ చేసుకోవచ్చు. ముఖ్యంగా అధిక ద్రవ్యోల్బణం ఉన్నప్పుడు ఈ పెట్టుబడులు కలిసొస్తాయి. అందుకే ఒకే రంగంపై దృష్టి పెడుతూ అందులోనే మొత్తం సొమ్మును పెట్టుబడిగా పెడితే పెద్దగా వృద్ధికి ఆస్కారం ఉండదు. పైగా సదరు రంగం కుదేలైతే మనమూ మునిగిపోతాం.

ఫ్లోటింగ్-రేట్ బాండ్లు, ఫండ్లు

ద్రవ్యోల్బణం అధికంగా ఉన్నప్పుడు స్వల్పకాలంలో మంచి రాబడులను అందుకోవడానికి ఈ ఫండ్లు చక్కగా దోహదం చేయగలవు. సాధారణంగా ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉంటే, వడ్డీరేట్లూ ఎక్కువగానే ఉంటాయి. ధరల్ని అదుపు చేయడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రెపోరేటును పెంచేస్తుంది. దీనివల్ల బ్యాంకుల రుణాలపై వడ్డీరేట్లూ పెరుగుతాయి. ఈ నేపథ్యంలోనే ఫ్లోటింగ్-రేట్ బాండ్లు, ఫండ్లలో ఇన్వెస్ట్‌మెంట్లు లాభదాయకం. కాబట్టి ద్రవ్యోల్బణం ఎక్కువగా నమోదవుతున్నప్పుడు ఈ ఫండ్లలో ఇన్వెస్ట్‌మెంట్లకు దిగితే అదనపు ఆదాయం అందుకోవచ్చు.

గుర్తుంచుకోండి

ధరలు పెరుగుతున్నప్పుడు రోజువారీ అవసరాల కోసం పెట్టే ఖర్చులూ పెరుగుతూపోతుంటాయి. దీనివల్ల నెలవారీ బడ్జెట్ తలకిందులవుతూ ఉంటుంది. కనుక ప్రతీ నెలా ఖర్చులు ఏవి? అన్నదానిపై స్పష్టత ఉంచుకుంటే ఎక్కడ అదనపు ఖర్చులుంటున్నాయో గుర్తించవచ్చు. అలాగే మ్యూచువల్ ఫండ్స్, సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల ద్వారా కూడా పెట్టుబడులకు దిగి స్టాక్ మార్కెట్‌లో ప్రవేశించవచ్చు. సురక్షితమైన పెట్టుబడుల కోసం ఎఫ్‌డీ, ప్రభుత్వ పథకాలు బెటర్. పోస్టాఫీస్ స్కీములూ లాభదాయకమే. ఐటీ మినహాయింపులూ ఉంటాయి.

పీవోఎంఐఎస్ భళా

నెలనెలా ఆదాయాన్ని ఆశించేవారు, సురక్షిత పెట్టుబడులపట్ల ఆసక్తిగలవారు పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కమ్ స్కీం (పీవోఎంఐఎస్)ను పరిశీలించవచ్చు. ఈ కేంద్ర ప్రభుత్వ పథకం ఆకర్షణీయ వడ్డీరేటును అందిస్తున్నది. అక్టోబర్-డిసెంబర్‌కు 7.40 శాతం వడ్డీరేటు వస్తున్నది. ఇతర చిన్నమొత్తాల పొదుపు పథకాల వడ్డీరేట్ల మాదిరిగానే ఈ పీవోఎంఐ స్కీం వడ్డీరేటును కూడా మూడు నెలలకోసారి సవరిస్తారు. ఇక ఈ పథకం కచ్చితమైన రాబడులను మదుపరులకు అందిస్తుంది. డెట్ ఇన్వెస్ట్‌మెంట్ల కంటే అవి ఉత్తమంగానే ఉంటాయి. స్కీం మెచ్యూరిటీ కాలవ్యవధి ఐదేండ్లు. గరిష్ఠంగా రూ.9 లక్షలు పెట్టుబడిగా పెట్టవచ్చు. ఇద్దరు లేదా ముగ్గురితో కలిసి కూడా స్కీంలో చేరవచ్చు. అప్పుడు పెట్టుబడి పరిమితి రూ.15 లక్షలు. ఇక 10 ఏండ్లు దాటిన పిల్లల పేరుతో కూడా స్కీంను తీసుకోవచ్చు.

అప్రమత్తత అవసరం

దేశీయ స్టాక్ మార్కెట్లలో ఒడిదొడుకులు కొనసాగుతున్నాయి. ప్రతికూల పరిణామాల మధ్య మదుపరులు పెట్టుబడుల ఉపసంహరణలకే పెద్దపీట వేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 156.61 పాయింట్లు లేదా 0.19 శాతం క్షీణించి 81,224.75 వద్ద నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 110.20 పాయింట్లు 0.44 శాతం పతనమై 24,854.05 దగ్గర ఆగింది. ఈ క్రమంలో ఈ వారం కూడా అమ్మకాల ఒత్తిడికే ఎక్కువగా వీలున్నట్టు అంచనా. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) ద్వితీయ త్రైమాసికానికి (జూలై-సెప్టెంబర్)గాను కార్పొరేట్ కంపెనీలు ప్రకటించే ఆర్థిక ఫలితాలు గత వారం మాదిరే ఈ వారం కూడా మార్కెట్ ట్రేడింగ్‌ను ప్రభావితం చేయనున్నాయి మరి. అందుకే మదుపరులు అప్రమత్తంగా ఉండాలని, ఇన్వెస్ట్‌మెంట్లపై ఆచితూచి స్పందించడం ఉత్తమమని మెజారిటీ ఎక్స్‌పర్ట్స